# సర్‌ప్రైజ్‌ల సమాహారం..

ఎమోషన్స్‌ను పండించడంలో రాజమౌళి మాస్టర్. టెక్నికల్‌గా ఆయన సినిమాలు బావుంటాయనే చాలా మంది అనుకుంటుంటారు. నిజానికి భావోద్వేగాల ఆవిష్కరణే ఆయన ప్రధాన బలం. 'స్టూడెంట్ నంబర్ 1' నుంచి 'ఆర్ఆర్ఆర్' వరకు ఆయన సినిమాలన్నీ భావోద్వేగ ప్రయాణాలే. రానున్న మహేశ్ సినిమా కూడా కథాపరంగా ఉద్వేగపూరితంగానే ఉంటుందని టాక్ నడుస్తున్నది. దక్షిణాఫ్రికా రచయిత విల్బర్ స్మిత్ రాసిన ఓ నవల ఆధారంగానే ఈ కథను రాయడం జరిగిందని రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ కథ విషయంలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయని సమాచారం. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే నిధి, నిక్షేపాల వేటగా ఈ సినిమా రూపొందనున్నట్టు బయట టాక్ నడుస్తున్నది. ఇక మహేశ్ పాత్ర విషయంలో ఆసక్తికరమైన వార్త ఒకటి వెలుగు చూసింది. హనుమంతుడ్ని ప్రేరణగా తీసుకొని రాజమౌళి ఆ పాత్రను డిజైన్ చేశారట. అలాగే మహేశ్ లుక్‌ని కూడా డిఫరెంట్‌గా ప్లాన్ చేశారట. కథాపరంగా ఇందులో ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందట. ఆ ఎపిసోడ్ కోసమే మహేశ్‌బాబు గడ్డం పెంచి రగ్గెడ్‌గా మారారని వినికిడి. ప్రీప్రొడక్షన్ వర్క్ పూర్తికావచ్చిన ఈ సినిమాకు సాయిమాధవ్ బుర్రా సంభాషణలు రాస్తున్నారని వార్తలు వస్తున్నాయి. మిగతా వివరాలు తెలియాల్సివుంది.

## రజనీ చిత్రంలో విలన్‌గా?



రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'వెట్టయాన్'.'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. వాణిజ్య హంగులు కలబోసిన సామాజిక సందేశాత్మక కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రంలో అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా, రితికా సింగ్ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో రానా ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. విద్యా వ్యవస్థలోని అవినీతి, అరాచకాలను చర్చిస్తూ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. టెక్నాలజీపై మంచి పట్టున్న స్టైలిష్ విలన్ పాత్రలో రానా పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నది.

## తెలుగులో అరంగేట్రానికి సిద్ధం?

'ప్రేమలు' చిత్రంతో యువతరం హృదయాలను దోచుకుంది మలయాళీ సోయగం మమితా బైజు. చూడముచ్చటైన రూపం, చక్కటి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించింది. 'ప్రేమలు' తెలుగు వెర్షన్ కూడా అద్భుతమైన ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ భామకు తెలుగులో కూడా భారీ ఆఫర్లొస్తున్నాయట. తాజా సమాచారం ప్రకారం విజయ్ దేవరకొండ సరసన మమితా బైజు నటించనుందని వినికిడి. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కించబోతున్న విషయం తెలిసిందే. కొద్ది మాసాల క్రితం ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. తొలుత ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా తీసుకున్నారు. అనివార్య కారణాల వల్ల ఆమె తప్పుకున్నట్లు తెలిసింది. ఇప్పుడా స్థానంలో మమిత బైజుని కథానాయికగా ఖరారు చేయబోతున్నారని సమాచారం.

## నందీశ్వరుడుగా ప్రభాస్?

మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో ప్రభాస్ అతిథి పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. శ్రీకాళహస్తి క్షేత్ర పురాణం ఆధారంగా రూపొందుతోన్న ఈ భక్తిరసాత్మక చిత్రంలో ప్రభాస్ పోషిస్తున్న పాత్ర ఏంటి? అనే విషయంపై గత కొన్ని రోజులుగా చర్చ నడుస్తూనే ఉంది. ఆయన ఈ సినిమాలో శివుడిగా నటిస్తున్నాడనే వార్త అయితే బలంగానే వినిపించింది. అయితే.. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ప్రభాస్ ఇందులో శివుడిగా నటించడంలేదట. ఇందులో ఆయన నందీశ్వరుడిగా కనిపించనున్నాడని తెలుస్తున్నది. కథలో నందీశ్వరుడిది సీక్వెన్స్ కీలకం కావడంతో ప్రభాస్‌ని ఒప్పించి, ఆ పాత్రను చేయించారట. ఇందులో శివుడిగా అక్షయ్‌కుమార్ నటిస్తున్నట్టు లేటస్ట్ న్యూస్. మోహన్‌లాల్, మోహన్‌బాబు, శివరాజ్‌కుమార్, నయనతార, బ్రహ్మానందం కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే న్యూజిలాండ్‌లో ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకుంది. 'కల్కి' షూటింగ్ హడావిడి అయిన వెంటనే ప్రభాస్ 'కన్నప్ప' కాల్‌షీట్స్ ఇస్తారట.

## శర్వానంద్ కొత్త చిత్రం



**యువ హీరో శర్వానంద్** ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. తాజా చిత్రం 'మనమే' త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఇటీవలే బర్త్‌డే సందర్భంగా శర్వానంద్ నటించబోతున్న రెండు కొత్త చిత్రాలను ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం శర్వానంద్ మరో సినిమాకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే...'ఘాజీ' 'అంతరిక్షం 9000' వంటి చిత్రాలతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా గుర్తింపును తెచ్చుకున్నాడు దర్శకుడు సంకల్ప్‌రెడ్డి. త్వరలో కొత్త చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే శర్వానంద్‌కు కథ వినిపించగా ఆయన ఓకే చేశారని సమాచారం. తొలి రెండు చిత్రాల తరహాలోనే వినూత్నమైన కథాంశంతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాకు ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. ఈ చిత్రానికి సంబంధించి త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని అంటున్నారు.

## ఓటు రేటును ఎవరు నిర్ణయిస్తారు?

ప్రస్తుత రాజకీయాలపై తెరకెక్కిన రాజకీయ వ్యంగ్యచిత్రం 'లక్ష్మీకటాక్షం'. 'ఫర్ ఓట్' అనేది ఉపశీర్షిక. సూర్య దర్శకుడు. యు.శ్రీనివాసులరెడ్డి, బి.నాగేశ్వరరెడ్డి, వహీద్ షేక్, కె.పురుషోత్తం రెడ్డి నిర్మాతలు. ప్రస్తుతం సినిమా నిర్మాణంలో ఉంది. మూవీ ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాకు చెందిన డైలాగ్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సాధారణంగా రాజకీయనాయకులు ఓటుకి ఇంత డబ్బు అని నిర్ణయిస్తారు. కానీ ఈ డైలాగ్ పోస్టర్‌లో ఓటర్ అనేవాడు తన రేటును తానే నిర్ణయించుకుంటాడు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలకి అద్దం పట్టేలా ఈ డైలాగ్ పోస్టర్ డిజైన్ చేయడం జరిగిందని, తాడిపత్రి నేపథ్యంలో చిత్రీకరణ జరిపామని, త్వరలో టీజర్‌నూ, ట్రైలర్‌నూ విడుదల చేస్తామని దర్శక, నిర్మాతలు తెలిపారు. సాయికుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో వినయ్, అరుణ్, దీప్తి వర్మ ముఖ్యపాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: నని ఐనవెల్లి, సంగీతం: అభిషేక్ రుపుస్.

## సూపర్‌యోధగా తేజ సజ్జ

'హను-మాన్'తో చారిత్రాత్మక విజయాన్ని అందుకున్నాడు యువకథానాయకుడు తేజ సజ్జా. అతని తర్వాతి సినిమాకోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణంలో ఎట్టకేలకు అతని తాజా సినిమా ప్రకటన వెలువడింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించనున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. సోమవారం ఈ సినిమాకు చెందిన పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోస్టర్‌లో తేజ సజ్జ తన ముఖంలో ఇంటెన్సిటీతో బ్యాక్ పోజ్‌లో కనిపిస్తున్నాడు. 'హను-మాన్'తో సంప్రదాయదుస్తుల్లో కనిపించిన తేజా.. ఈ సినిమాలో స్టైలిష్ మేక్ ఓవర్‌తో సూపర్‌యోధగా కనిపిస్తున్నాడు. ఈ నెల 18న ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్టు మేకర్స్ తెలిపారు. లార్జర్ దేన్ లైఫ్ కథాంశంతో, సాహసోపేత వీరగాథగా ఈ సినిమా ఉండనుందని దర్శకుడు తెలిపారు. హై టెక్నికల్ వేల్యూస్‌తో ఈ సినిమా తెరకెక్కనున్నదని, ఈ నెల 18న సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు కూడా వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి రచన: మణిబాబు కరణం, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

## సందేశాత్మక తెప్పసముద్రం

బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాల నేపథ్యంలో సాగే కథాంశంతో తెరకెక్కిన సందేశాత్మక చిత్రం 'తెప్పసముద్రం'. అర్జున్ అంబటి, కిశోరి దాత్రక్ జంటగా నటించారు. రవిశంకర్, చైతన్యరావు కీలక పాత్రలు పోషించారు. సతీశ్ రాపోలు దర్శకుడు. నీరుకంటి మంజులా రాఘవేందర్‌గౌడ్ నిర్మాత. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించి, ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాలే కాకుండా కొన్ని ప్రత్యేకమైన ఎలిమెంట్స్ కూడా ఈ కథలో ఉంటాయని, కంటెంట్ ఉన్న సినిమాను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకోసం అందరూ చాలా కష్టపడ్డారని, అందుకే సినిమా బాగా వచ్చిందని నిర్మాత పేర్కొన్నారు. ఇంకా నటీనటులు, సాంకేతిక నిపుణులు కూడా మాట్లాడారు.

## వేసవిలో వినోదాల జల్లు

అల్లరి నరేష్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆ ఒక్కటి అడక్కు'. మల్లి అంకం దర్శకుడు. చిలకా ప్రొడక్షన్స్ పతాకంపై రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. మే 3న ప్రేక్షకుల ముందుకురానుంది. ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమా ఉభయ తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ సొంతం చేసుకుంది. రెండు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నారు. 'ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. జ్యోతిష్యం నేపథ్యంలో సాగే ఈ కథ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. తాను వలచిన అమ్మాయిని పెళ్లి చేసుకునే క్రమంలో ఓ యువకుడికి ఎదురైన సంఘటనలేమిటన్నదే సినిమా కథాంశం' అని చిత్ర బృందం పేర్కొంది. వెన్నెల కిషోర్, జామీ లివర్, వైవా హర్ష, ఆరియానా గ్లోరీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సూర్య, సంగీతం: గోపీసుందర్, సహ నిర్మాత: భరత్ లక్ష్మీపతి, దర్శకుడు: మల్లి అంకం.

## మూకీ చిత్రం 'కావ్యరాజ్'

కవితరాజ్‌పుత్, జమున, అంజలి, మధు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కావ్య రాజ్'. మధు లింగాల దర్శకుడు. గజగౌని దయానంద్ గౌడ్ నిర్మిస్తున్నారు. ఇటీవల ట్రైలర్‌ను ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ విడుదల చేశారు. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తెలంగాణ నేపథ్యంలో రూపొందించిన మూకీ చిత్రమిది. కథ, కథనాలు చాలా కొత్తగా ఉంటాయి. తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతి నందిస్తుంది' అన్నారు. వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, కథలోని మలుపులు ఉత్కంఠను పంచుతాయని దర్శకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## నా పక్కన నటించడానికి వాళ్లు ఇష్టపడరు

తాను మాత్రమే చేయగలిగిన పాత్రలను ఎంచుకొని మరీ నటించే గొప్ప నటి విద్యాబాలన్. తనుంటే హీరోతో పనిలేదు. సినిమా మొత్తాన్ని భుజంపై మోసేంత కెపాసిటీ ఉన్న హీరోయిన్ తను. సినీ పరిశ్రమపై ఆమెకంటూ కొన్ని కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. వాటిని సందర్భం వచ్చినప్పుడు కుండ బద్దలు కొట్టి మరీ చెప్పడం విద్యాబాలన్ స్పెషాలిటీ. తాజాగా ఓ ఆంగ్ల మీడియా ఇంటర్వ్యూలో బాలీవుడ్‌పై ఆసక్తికరంగా మాట్లాడారు విద్యాబాలన్. 'బాలీవుడ్‌లో బంధుప్రీతి ఎక్కువ అనే అభిప్రాయం చాలామందిలో ఉంది. నేనైతే దాన్ని ఒప్పుకోను. అదే ఉంటే హీరోల పిల్లలందరూ సక్సెస్ అయ్యేవారుకదా!? ఇక్కడ టాలెంట్ ముఖ్యం. ఉదాహరణకు నన్నే తీసుకోండి. నాకెలాంటి సినీ నేపథ్యం లేదు. కిందస్థాయి నుంచి కష్టపడి పైకి వచ్చాను. అందుకే ప్రేక్షకులు నన్ను చూసే దృక్కోణం భిన్నంగా ఉంటుంది. అదే నా వెనుక ఏదైనా స్టార్ ఫ్యామిలీ ఉంటే, నన్ను మరోలా చూసేవారేమో. ఇప్పుడున్న నా స్థాయి, అవకాశాలు.. ఇవన్నీ నా నటన చూసే వచ్చాయి.' అంటూ చెప్పుకొచ్చింది విద్యాబాలన్. ఇంకా మాట్లాడుతూ 'నేను స్త్రీ ప్రాధాన్యతా చిత్రాల్లో ఎక్కువ నటిస్తుంటాను. వాటిని ప్రేక్షకులు కూడా బాగానే ఆదరిస్తుంటారు. కొందరు హీరోలకు అది నచ్చదు. అందుకే నా పక్కన నటించడానికి వాళ్లు ఇష్టపడరు. దానికి నేనేం బాధపడను. ఇది కూడా ఓ విధంగా గౌరవంగానే భావిస్తా' అంటూ అందంగా నవ్వేశారు విద్యాబాలన్.